## క్లుప్తంగా

### నేడు మండల సమావేశం

**ధన్వాడ:** మండల సర్వసభ్య సమావేశాన్ని సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి వచ్చే వివిధశాఖల అధికారులు తమ నివేదికలతో రావాలని సూచించారు. అలాగే మండలంలోని అన్నిగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరు కావాలన్నారు.

### 5న స్వీపర్ల చలో హైదరాబాద్

**మాగనూర్:** తమ సమస్యల పరిష్కారానికి ఈనెల 5న పాఠశాల స్వపర్ల చలో హైదరాబాద్ కార్యక్రమం చేపట్టనున్నామని సంఘం జిల్లా నాయకుడు అంజప్ప ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్‌26నుంచి రాష్ట్రవ్యాప్తంగా పాఠశాల స్వీపర్లు రిలేదీక్షలు చేపడుతున్న ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. 5న ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా కార్యక్రమం చేపడుతున్నామని, స్వీపర్లు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

### 'గృహలక్ష్మి' అర్హులకు కేటాయించాలి

**మరికల్:** ప్రభుత్వం అమలు చేసిన గృహలక్ష్మి పథకం కింద అర్హులైన లబ్ధిదారులను ఎంపికచేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరన్న, నాయకులు రామకృష్ణ, మొగులప్ప అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలో గృహలక్ష్మి జాబితాను అధికార పార్టీ సర్పంచ్‌ల చేతిలో ఉండటంతో వారు చెప్పిన వారి పేర్లకే ఇళ్లు వచ్చే అవకాశం ఉందని ఆరోపించారు. అధికారులు క్షేత్రస్థాయిలో గుర్తించిన అర్హులకు మాత్రమే ఇళ్లు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఇందుకు విరుద్ధంగా అధికార పార్టీ నాయకులు కాసులకు కక్కుర్తిపడి వారి అనుచరుల పేర్లను గృహలక్ష్మి పథకంలో చేరిస్తే కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామన్నారు.

### ధర్నాను విజయవంతం చేయాలి

**నారాయణపేట:** పెండింగ్ బిల్లులు, పెంచిన వేతనాలు విడుదల చేయాలని సోమవారం చేపట్టనున్న మధ్యాహ్నభోజన కార్మికుల ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం, కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటయ్య ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

### వర్షానికి కూలిన ఇల్లు



**మక్తల్:** మండలంలోని కర్ని గ్రామానికి చెందిన నర్సింగమ్మ ఇల్లు శనివారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి కూలిపోయింది. వెంటనే గుర్తించిన బాధితులు ఇంట్లోనుంచి బయటకు రావడంతో ప్రమాదం నుంచి బయటకు పడ్డారు. వర్షానికి ఇల్లు కూలిపోయిన బాధితులను ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### డివైడర్‌ను ఢీకొన్న తుఫాన్



**అమరచింత:** పట్టణంలోని పోలీస్‌స్టేషన్ రహదారిపై డివైడర్‌ను తుఫాన్ ఢీ కొట్టిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. జోగుళాంబ గద్వాల జిల్లా పరిధిలోని మల్దకల్ నుంచి నారాయణపేట జిల్లా కోటకొండకు తుఫాన్‌లో శుభకార్యానికి వెళ్తున్నారు. అమరచింత పెట్రోల్ బంక్ సమీపంలో డీవైడర్‌ను తుఫాన్ ఢీ కొట్టడంతో వాహనం ముందు చక్రంతో పాటు అద్దాలు ధ్వంసమయ్యాయి. వెంటనే స్థానికులు గమనించి వారిని రక్షించారు. వాహనంలో ప్రయాణిస్తున్న వారితో పాటు డ్రైవర్ సైతం మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

### బీసీలకు ఎమ్మెల్యే టికెట్లు కేటాయించాలి



**మహబూబ్‌నగర్ రూరల్:** రాజకీయ పార్టీలన్నీ బీసీ నాయకులకు అసెంబ్లీ టికెట్లు కేటాయించాలని ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులుగౌడ్ డిమాండ్ చేశారు. టికెట్లు ఇవ్వకుంటే పార్టీలను రాజకీయ సమాధి చేయడానికి బీసీ ప్రజానీకం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఆదివారం టీఎన్జీఓ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జనాభా దామాషా ప్రకారం స్థానాలను కేటాయించాలని అన్నారు. 23 టికెట్లు కేటాయించి బీఆర్ఎస్ బీసీ వ్యతిరేక పార్టీగా నిలిచిందని పేర్కొన్నారు. టికెట్లు ఇవ్వని పార్టీల ఓటమే లక్ష్యంగా పని చేస్తామని హెచ్చరించారు. ఐక్యవేదిక రాష్ట్ర కోశాధికారి జి.రంగప్పయాదవ్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కె.రాజు ప్రజాపతి, ప్రధాన కార్యదర్శి లింగం గౌడ్, నారాయణపేట జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

# రసాయన ఎరువులతో నష్టాలు

- సహజ లక్షణాన్ని కోల్పోతున్న భూములు
- క్షీణించి పోతున్న భూసారం
- సేంద్రియ ఎరువులే మేలంటున్న వ్యవసాయ అధికారులు



మాగనూర్ శివారులో యూరియా వేస్తున్న రైతు(ఫైల్)

**మాగనూర్:** పంటసాగులో రసాయనాల వాడకం ఓ వైపు పుడమికి నష్టాలు, మరోవైపు మానవ మనుగడకు కష్టాలు తెచ్చిపెడుతోంది. జీవన మనుగడకు ఆధారమైన పుడమిపై రసాయనాల వాడకం రోజురోజుకూ పెరుగుతోంది. దీంతో భూమి సహజ లక్షణాన్ని కోల్పోయి సాగుభూములు నిస్సారమవుతున్నాయి. ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో భూమి ఉన్నా.. సేద్యానికి పనికిరాకుండా పోతుందని వ్యవసాయ అధికారులు ఆందోళన చెందుతున్నారు. సేంద్రియ ఎరువుల వాడకం ఒక్కటే శరణ్యమంటున్నారు.

**అధిక దిగుబడులు..**

ఉమ్మడి మండలంలో 18,200 మంది రైతులున్నారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో ఉమ్మడి మండలవ్యాప్తంగా వరి 22వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగుచేస్తున్నారు. వీటిలో పత్తి, కంది పంట 38000 ఎకరాలు. దిగుబడులు బాగా రావాలని ఎకరాకు 150కిలోల డీఏపీ, వందకిలోల యూరియాను వినియోగిస్తున్నారు. చీడపీడల బెడదతో పూతదశకు వచ్చాక పత్తికి ఐదారు, కందికి మూడుసార్లు క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తారు. 1760లో వచ్చిన హరితవిప్లవం వ్యవసాయ విధానంతో మొత్తం రూపురేఖలు మారిపోయాయి. రసాయనిక ఎరువులతో దిగుబడులు పెరుగుతాయని, మోతాదును పెంచుతున్నారు.



పత్తిచేనులో యూరియా పెడుతున్న చిన్నారులు (ఫైల్)

**గతంలో వ్యవసాయం..**

గతంలో వ్యవసాయం చేసే తీరేవేరు ఉండేది. అప్పట్లో రైతు తనకుటుంబానికి సరిపడా అన్నివిధాలా ధాన్యాలు పండించేవాడు. దిగుబడికోసం సేంద్రియ ఎరువులు చల్లి రసాయనాలు లేని ఉత్పత్తులు అందించేవాడు. దీంతో ఆరోగ్యంగా ఉండేవారు.

**క్షీణిస్తున్న భూసారం..**

అధిక రసాయనిక ఎరువులు వాడకంతో భూములు నిస్సారమవుతున్నాయి. యూరియా బస్తాలో 46శాతం మాత్రమే ఉంటుంది. మిగతా 54శాతం సున్నపు గుళికల్లాంటి మూలపదార్థం ఉంటుంది. దీనిపై యూరియా పూతపూస్తారు. దీనిని నేలపై వేయడంతో 54శాతం ఉన్న మూలపదార్థం ఏటా నేలపై పేరుకుపోయి భూసారం తగ్గుతుంది. నేలలో ఉండే సహజమైన బ్యాక్టీరియా, వానాపాములు నశించిపోతున్నాయి. దీంతో దిగుబడులు రావడం లేదు.

**అవగాహన లేక పోవడంతో..**



సేంద్రియ ఎరువుల తయారీపై రైతలకు అవగాహన లేకపోవడంతో ఎప్పుడు పడితే అప్పుడు రసాయనిక ఎరువులు, మందులపై ఆధారపడుతున్నారు. అధికారులు ప్రత్యేక శిక్షణ తరగుతులు నిర్వహిస్తే బాగుంటుంది.

– కర్రెప్ప, రైతు గురువలింగంపల్లి

**భూసారం పెరుగుతుంది..**



భూసారాన్ని కోల్పోకుండా ఉండేందుకు రైతులు సేంద్రియ ఎరువులు వాడాలి. సేంద్రియ ఎరువుతో భూమిలో పోషక విలువలు పెరిగి గుల్లగా మారుతాయి. నీటిని పీల్చుకునే తత్వం వృద్ధిచెంది, మొక్కలకు నీటితో పోషకాలు సమృద్ధిగా అందుతాయి. భూసారం కూడా పెరుగుతుంది.

– సుదర్శన్‌గౌడ్, ఇన్‌చార్జి మండల వ్యవసాయాధికారి మాగనూర్

# ఓటరు జాబితా పూర్తి చేయాలి



ఆత్మకూర్‌లో ఓటరు నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజు

**ఆత్మకూర్:** ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు నమోదు, ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని తహసీల్దార్ రాజు అన్నారు. ఆదివారం మండలంలోని గ్రామాల్లో పర్యటించి ఓటరు నమోదును పరిశీలించారు. 2023 అక్టోబర్ ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు పూర్తయిన వారి వివరాలను సేకరించి నమోదు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ చాణక్య, ఆర్ఐ జయమ్మ, సీనియర్ అసిస్టెంట్ నాగేంద్రప్రసాద్, బీఎల్ఓలు ఉన్నారు.

## పిడుగుపాటుకు కాడెద్దులు మృతి

**దామరగిద్ద:** పిడుగుపాటుకు కాడెద్దులు మృతిచెందిన సంఘటన శనివారం రాత్రి మండలంలోని చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మండలంలోని ఉద్మల్‌గిద్ద గ్రామానికి చెందిన రైతు పెద్దింటి బాలప్పకు చెందిన రెండు కాడెద్దులను పొలం సమీపంలో పశువుల పాకలో కట్టేయగా శనివారం రాత్రి కురిసిన ఉరుములు మెరుపుల వర్షానికి పిడుగుపడి రెండు కాడెద్దులు మృతిచెందాయి. ఉదయం పొలానికి వెళ్లిచూసిన రైతు బాలప్ప కుమారుడు కిష్టప్ప బోరున విలపించారు. జీవనాధారమైన కాడెద్దులకు అకాల మృతితో రైతుకు తీవ్రనష్టం వాటిల్లిందని గ్రామానికి చెందిన కార్మిక సంఘం నాయకులు గోపాల్, బీకేఎస్ నాయకుడు బాల్‌చందర్ కలెక్టర్ కోయశ్రీ హర్షకు వినతిపత్రం అందజేశారు. రూ. 80వేల విలువలగల కాడెద్దులకు కోల్పోయిన రైతుకు ప్రభుత్వం ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని కోరారు.

## కరాటేలో విద్యార్థుల ప్రతిభ

**మహబూబ్‌నగర్ క్రీడలు:** నారాయణపేటలో ఆదివారం డ్రాగన్ షోటోకాన్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో జిల్లా కేంద్రంలోని శ్రీహనుమాన్ కరాటే అసోసియేషన్ విద్యార్థులు ప్రతిభచాటి పతకాలు సాధించినట్లు ఫౌండర్ కె.వెంకటేశ్ తెలిపారు. ఈ పోటీల్లో అండర్–14 విభాగం కటాస్‌లో గణేష్, అండర్–8 విభాగం కటాస్‌లో వరుణ్‌తేజ ప్రథమ స్థానంలో నిలిచారని వివరించారు.

## వైఎస్సార్‌ను మరిపించే పాలకులే లేరు

**మహబూబ్‌నగర్ రూరల్:** మహానేత వైఎస్సార్‌ను మరిపించే పాలకులే లేరని పలువురు నాయకులు కొనియాడారు. వైఎస్ రాజశేఖరరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మల్లు కృష్ణారెడ్డి వర్ధంతులను పురస్కరించుకుని ఆదివారం మాచన్‌పల్లిలో వారి విగ్రహాలకు నాయకులు నివాళులు అర్పించారు. సర్పంచ్ మల్లికార్జున్‌రెడ్డి, మల్లిక పాల్గొన్నారు.

# మినీ స్టేడియానికి నిధులు మంజూరు: మంత్రి



ఉత్తర్వుల కాపీ అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** గ్రామీణ ప్రాంతాల్లోనూ అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారుచేయడమే తమ లక్ష్యమని మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. హన్వాడలో మినీ స్టేడియం కోసం రూ.3.70 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఈ మేరకు ఆదివారం రాత్రి హన్వాడ మండల ప్రజాప్రతినిధులు జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ బాలరాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, ముడా డైరెక్టర్ కొండా బాలయ్య, సింగిల్‌విండో వైస్ చైర్మన్ కృష్ణయ్యగౌడ్, మండల కో–ఆప్షన్ సభ్యుడు మన్నన్ పాల్గొన్నారు.

**హన్వాడ:** మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆదివారం బుద్ధారం గ్రామానికి చెందిన వెంకట్రాములుకు రూ.3లక్షలు ఎల్‌ఓసీ అందజేశారు. అంతకుముందు పలు వివాహ వేడుకలకు హాజరయ్యారు.

**జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్):** జిల్లా కేంద్రంలోని బోయపల్లిలో రెడ్డి ఫంక్షన్ హాల్ నిర్మాణం కోసం అర ఎకరా భూమి, రూ.1 కోటి నిధులను మంజూరు చేసినట్లు మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. క్యాంపు కార్యాలయంలో సంఘం సభ్యులకు నిధుల మంజూరు ఉత్తర్వు కాపీని అందించారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా డైరెక్టర్ మల్లు నరసింహారెడ్డి, సంఘం నాయకులు బుచ్చారెడ్డి, రామకృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తెరుచుకోని గ్రంథాలయం

- ఏటేటా నిర్వహణ చెల్లింపులు
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు




పట్టణంలో మూత పడిన గ్రంథాలయం

**అమరచింత:** పట్టణంలో కొన్ని సంవత్సరాలుగా గ్రంథాలయం తలుపులు మూసుకొనే ఉన్నాయి. దీని గురించి సంబంధిత అధికారులు కాని, ప్రజా ప్రతినిధులు కాని పట్టించుకోలేదు. దీంతో గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలు, గ్రంథాలు చదలు పడుతున్నాయి. మండలం ఏర్పడక ముందు అమరచింతలో శాఖ గ్రంథాలయాన్ని నిత్యం తెరిచి ఉంచేవారు. పాఠకులకు దినపత్రికలతో పాటు కథల పుస్తకాలు, వివిధ రకాల నవలలు అందుబాటులో ఉంచేవారు. ఎప్పుడైతే మండలం ఏర్పడిందో అప్పటి నుంచి గ్రంథాలయ నిర్వాహణపై జిల్లా గ్రంథాలయ శాఖ దృష్టి పెట్టడడం లేదు. దీంతో ఇప్పటికీ గ్రంథాలయం తలుపులు మూసుకోనే దర్శనమిస్తున్నాయి. గతంలో కొంత మంది యువకులు, ఉపాధ్యాయులు, వివిధ రాజకీయపార్టీల నాయకులు సహకరించి, చందాలువేసి గ్రంథాలయాన్ని నడిపించారు. మాజీ అడ్వకేట్ జనరల్, డీఎంఆర్ఎం ట్రస్ట్ చైర్మన్ దేశాయి ప్రకాష్‌రెడ్డి గ్రంథాలయ బిల్డింగ్ కిరాయి, నిర్వాహకుడికి వేతనం అందిస్తూ వచ్చారు. కొంత కాలానికి భారం పెరగడంతో వెనక్కి తగ్గారు. గత నాలుగేళ్లుగా గ్రంథాలయం మూతపడే ఉంది. మున్సిపాలిటీ అయితే గ్రంథాలయానికి మహర్దశ వస్తుందని పాఠకులు ఆశపడ్డారు. కానీ గ్రంథాలయాన్ని పట్టించుకోకపోవడంతో వారికి నిరాశే మిగిలింది.

**మూడేళ్లుగా నిర్వహణ చెల్లింపులు..**

మున్సిపాలిటీ ఏర్పాటు తర్వాత అధికారుల ఆదేశాల మేరకు పట్టణంలో గ్రంథాలయ నిర్వహణ కోసం ప్రతి సంవత్సరం ఇంటి పన్ను వసూళ్లలో ఏడు శాతం వాటను జిల్లా గ్రంథాలయ సంస్థకు కేటాయిస్తున్నారు. మూడేళ్లుగా రూ.15 వేలు, రూ.45 వేలు, రూ.92 వేలు మున్సిపాలిటీ ద్వారా చెల్లిస్తున్నారు. ఈ ఏడాది రూ.2.30లక్షలు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నారు. మున్సిపాలిటీ ద్వారా నిర్వహణ అందుకుంటున్న జిల్లా గ్రంథాలయ శాఖ మాత్రం కనీసం దినపత్రికలను అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేయడం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మూత పడిన గ్రంథాలయాన్ని తెరిపించాలని యువకులు, పాఠకులు కోరుతున్నారు.

**అధికారుల నిర్లక్ష్యం..**



పట్టణంలో ఎన్నో ఏళ్లుగా గ్రంథాలయం మూతపడింది. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. మున్సిపాలిటీ ద్వారా డబ్బులు తీసుకుంటున్న జిల్లా గ్రంథాలయ శాఖ పట్టణంలో ఉన్న గ్రంథాలయాన్ని పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా గ్రంథాలయాన్ని వినియోగంలోకి తీసుకురావాలి.

– తౌఫిక్, అమరచింత

**నిర్వహణ చెల్లిస్తున్నాం..**



పట్టణంలో గ్రంథాలయ నిర్వహణ ఉంది. వాటికోసం జిల్లా గ్రంథాలయ శాఖ వారి ఆదేశాల మేరకు ప్రతి సంవత్సరం నిర్వహణ నిధులు చెల్లిస్తున్నాం. ఉన్నతాధికారులకు సమస్యను చెప్పి గ్రంథాలయాన్ని అందుబాటులోకి తెచ్చేవిధంగా చర్యలు తీసుకుంటాం.

– మహమ్మద్ ఖాజా, మున్సిపల్ కమిషనర్

# క్రీడా పాఠశాలకు విద్యార్థి ఎంపిక



వినాయక్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం

**మాగనూర్:** మండలంలోని ఉజ్జెల్లి మండలప్రాథమికొన్నత పాఠశాలలో నాల్గోతరగతి చదువుతున్న వినాయక్ అనే విద్యార్థి తెలంగాణ క్రీడాపాఠశాలకు ఎంపికైనట్లు హెచ్ఎం సాయిబాబా తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి తల్లిదండ్రులు, గ్రామస్తులతో కలిసి ఎమ్మెల్యే నివాసంలో వినాయక్‌ను ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి శాలువాతో సన్మానించారు. భవిష్యత్‌లో ఉన్నతశిఖరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు మహేష్, చైర్మన్ నర్సింగప్ప, మండల బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ సుతారిరవి తదితరులు పాల్గొన్నారు.

# శంఖారావానికి తరలిన పద్మశాలీల నాయకులు



ధన్వాడ నుంచి తరలివెళ్తున్న నాయకులు

**ధన్వాడ:** హైదరాబాద్‌లో నిర్వహించిన పద్మశాలీ సంఘం శంఖారావానికి ఆదివారం మండల పద్మశాలీ సంఘం నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా పద్మశాలీ సంఘం రాష్ట్రకార్యదర్శి ఉదయభాను మాట్లాడుతూ.. పద్మశాలీలకు రాజకీయంగా గుర్తించి అసెంబ్లీ సీట్లు కేటాయించాలని, అలాగే రూ. లక్షా ఆర్థికసాయం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బాల్‌రాజ్, వీరేష్, శ్రీనివాసులు, శివాజీ, వెంకట్‌రాములు, సురేందర్, విజయ్‌కుమార్, నాగర్జున తదితరులు పాల్గొన్నారు.



ఊట్కూరు మండలం నుంచి తరలివెళ్తున్న నాయకులు

**ఊట్కూరు:** హైదరాబాద్‌లో నిర్వహించనున్న శంఖరావానికి మండలం నుంచి పలువురు పద్మశాలీలు ఆదివారం తరలివెళ్లారు. ఊట్కూరు, చిన్నపొర్ల, పెద్దపొర్ల, పులిమామి. పగిడిమారి గ్రామాల నుంచి ప్రత్యేక వాహనాలలో తరలివెల్లారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకులు ఆంజనేయులు మాట్లాడుతూ.. పద్మశాలీలు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా వెనకబడి ఉన్నారని తెలిపారు. పద్మశాలీలందరూ ఐక్యతతో రాజ్యాధికార దిశగా ఐక్యమత్యంతో ఉండాలని కోరారు. తరలివెళ్లినవారిలో నాయకులు కృష్ణామీనన్, మనోహర, బోగం లక్ష్మీనారాయణ, తిరుపతి, రమేష్, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

# రోడ్డుపైనే నిర్మాణ సామగ్రి.. వాహనదారులకు ఇబ్బంది



రోడ్డుపై వేసిన ఇంటి నిర్మాణ సామగ్రి

**మద్దూరు:** మండలంలోని పల్లెర్లలో పంచాయతీ కార్యాలయం చౌరస్తా నుంచి గ్రామంలోకి బీసీ కాలనీకి వెళ్లే రహదారిపై ఇసుక, కంకర వేయడంతో వాహనదారులు వెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొందని గ్రామస్తులు తెలిపారు. కొన్నిరోజుల క్రితం చౌరస్తాలో ఉన్న పీర్ల మజీద్ తొలగించి పునర్ నిర్మాణం చేయాలని ఉన్న మజీద్‌ను తొలగించారు. అలాగే పునర్‌నిర్మాణం కోసం రెండునెలల క్రితం రాయి, ఇసుక, కంకర, బూసరోడ్డుపై వేశారు. ఇప్పటివరకు దాన్ని తొలగించడం లేదని వాపోయారు. ఈ విషయాన్ని పంచాయతీ దృష్టికి తీసుకెళ్లిన లాభం లేకుండా పోయిందన్నారు. రోడ్డు ఇరుకుగా ఉండడం పక్కనే మురుగు కాల్వ ఉండడంతో వాహనాదారులకు ఇబ్బందులు ఏర్పడిందన్నారు. అధికారులు కల్పించుకొని రోడ్డుపై ఉన్న నిర్మాణ సామగ్రిని తొలగించాలని కోరుతున్నారు.

# భక్తిశ్రద్ధలతో బొడ్రాయి పున:ప్రతిష్ఠాపన



బొడ్రాయి పున:ప్రతిష్ఠాపన అనంతరం పూజలు చేస్తున్న గ్రామస్తులు



బొడ్రాయిలకు బోనమెత్తిన ఆడపడుచులు

**మద్దూరు:** పట్టణంలో బొడ్రాయి పున:ప్రతిష్ఠాపన కార్యక్రమం మూడోరోజు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కాచువాగు శివాలయం నుంచి బొడ్రాయిలను భారీ ఊరేగింపుతో పాతబస్టాండ్ కోట్ల, బడేసాబ్‌దర్గ, బాలుర హాస్టల్ వద్దకు తీసుకొచ్చారు. బ్రాహ్మణులు వేదమంత్రోచ్చరణలతో బొడ్రాయి పున:ప్రతిష్ఠాపన పాతబస్టాండ్ వద్ద ఎంపీపీ విజయలక్ష్మి, బడేసాబ్ వద్ద సర్పంచ్ అరుణ, బాలుర హాస్టల్ దగ్గర ఎంపీపీ వెంకటయ్య, కోట్ల ఉపసర్పంచ్ యాదవరెడ్డి దంపతులు పూజలు చేశారు. పూజల అనంతరం కాచువాగు శివాలయం వద్ద ఏర్పాటుచేసిన హోమ మండపంలో పూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ డైరెక్టర్ సలీం, పీఏసీఎస్ చైర్మన్ జగదీశ్వర్ హాజరైయ్యారు. అనంతరం పంచాయతీ కార్యాలయం వద్ద అన్నదానం చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం గ్రామ ఆడపడుచులు బొడ్రాయిల జలాభిషేకం చేసి, బోనాల ఊరేగింపు చేశారు. బొడ్రాయి పున:ప్రతిష్ఠాపన కార్యక్రమానికి వివిధ ప్రాంతాలను నుంచి గ్రామస్తులు రావడంతో పట్టణంలో పండగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో గ్రామపెద్దలు రాంరెడ్డి, శివరాజ్, నర్సింహులు, శ్రీశైలం, రాఘయ్య, వీరేష్‌గౌడ్, శివకుమార్, అంజయ్య, బుగ్గప్ప, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.



మద్దూరులో బొడ్రాయిల ఊరేగింపు

# రైతు సమస్యలు తీర్చడంలో ప్రభుత్వం విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

**అమరచింత:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యాయని ఎస్‌కేఎం జిల్లా నాయకులు వెంకటేష్, రాబర్ట్, రాజన్నలు అన్నారు. జెడ్పీఉన్నత పాఠశాల ఆవరణలో రైతు సమస్యలపై సోమవారం నిర్వహించే జిల్లా సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లా రైతు సదస్సుకు రాష్ట్ర నాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు. రైతు సమస్యల పరిష్కారం కోరుతూ దేశ వ్యాప్తంగా 570 సంఘాలతో ఎస్‌కేఎం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దిన్ని రాష్ట్ర, జిల్లా స్థాయిలలో వ్యాప్తి చేయ్యడానికి వీలుగా రైతు కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు వారు వెల్లడించారు. కార్యక్రమంలో అజయ్ ప్రసాద్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

# పనితీరు ఆధారంగానే నివేదికలు




జమాల్‌పూర్‌లో క్రీడాప్రాంగణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

**కోయిల్‌కొండ:** గ్రామాలలో జూనియర్ గ్రామపంచాయతీ కార్యదర్శులు తమ పనితీరును మెరుగుపరుచుకోవడం ద్వారా రెగ్యులరైజేషన్ అవకాశం ఉంటుందని అదనపు కలెక్టర్ యాదయ్య అన్నారు. ఆదివారం జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన మండలంలోని వివిధ గ్రామాల్లో జూనియర్ కార్యదర్శుల పనితీరు గురించి ఆరాతీశారు. పనితీరు ఆధారంగానే నివేదికలు పంపిస్తామన్నారు. ఫారెస్టరేంజ్ ఆఫీసర్ మగ్దుమ్, ఎంపీడీఓ జయరాములు, జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.